## క్లుప్తంగా

### మద్దతు ధర ప్రకటించాలి

ములకలపల్లి: రైతులు పండించిన అన్నిరకాల పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అవునూరి మధు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని గుట్టగూడెం గ్రామంలో సోమవారం నిర్వహించిన డివిజన్ స్థాయి శిక్షణా తరగతులకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని ఆరోపించారు. పార్టీ ములకలపల్లి సబ్‌డివిజన్ కార్యదర్శి కుంజా కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గొని నాగేశ్వరరావు, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి ఎస్‌కె.ఉమర్, ఇఫ్టూ ప్రధాన కార్యదర్శి సారంగపాణి, జక్కుల రాంబాబు, ముసలి సతీశ్, సవళ్ల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

### నిత్యావసరాల పంపిణీ

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం పోలీసుల ఆధ్వర్యంలో మావోయిస్టు, వరద ప్రభావిత గ్రామస్తులకు నిత్యావసర వస్తువులను సోమవారం పంపిణీ చేశారు.

మండలంలోని వరద ప్రభావిత గ్రామాలైన సున్నంబట్టి, కాశి నగరం గ్రామస్తులకు, ముల్కనపల్లి, మానగట్టు, గద్దేమడుగు మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లోని 375 కుటుంబాలకు నెస్టిల్ కంపెనీ, జేసీఐ స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిత్యావసరాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా 141 బెటాలియన్ సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రేవతి, సీఐ అశోక్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వెంకటప్పయ్య, గణేష్, నెస్టిల్ ఇండియా మేనేజర్ వసీం అహ్మద్, జేసీఐ ఇండియా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, పోలీసులు, సీఆర్పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

### దుప్పట్లు అందజేత



దుప్పట్లు పంపిణీ చేస్తున్న బిర్రం వెంకటేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: చలికాలం నేపథ్యంలో మండలంలోని పాలగుంపు గ్రామానికి చెందిన 38 కుటుంబాలకు, వృద్ధులకు వినాయకపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బిర్రం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉచితంగా దుప్పట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలికాలంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గిరిజనులు, వృద్ధులకు ప్రతి ఏటా ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పండా రాజులు, కాకా సత్యనారాయణ, సున్నం వెంకటేశ్వరరావు, గొంది కృష్ణ, గొంది వెంకటేశ్వరరావు, కాకా మధు పాల్గొన్నారు.

### ఆలయ వార్షికోత్సవం

దమ్మపేట: మండల కేంద్రం, దమ్మపేట శివారులో ఉన్న గాయత్రి ఆశ్రమంలో ఉన్న శ్రీఅరుణాచలేశ్వర స్వామి ఆలయ 11వ వార్షికోత్సవ వేడుకలను ఆశ్రమ వ్యవస్థాపకులు మూర్తిజీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం వేకువజాము నుండే అరుణాచలేశ్వరుడికి రుద్రాభిషేకం, అర్చన తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చండీహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను మూర్తిజీ, వేద పండితులచే శాస్త్రోక్తంగా నిర్వహించగా.. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కనులవిందుగా తిలకించారు. స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు అందరికీ అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.

### పార్టీని బలోపేతం చేయాలి

మణుగూరురూరల్: బీఆర్‌ఎస్ పార్టీని స్థానికంగా మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని బుగ్గ గ్రామంలో జరిగిన గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతంలో చేసిన సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ కన్వీనర్ కుంట లక్ష్మణ్, మాజీ సర్పంచ్ తాటి రామకృష్ణ, నాయకులు నరసింహారావు, రామకోటి, సురేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సవాలు నిర్వహించాలి

మణుగూరుటౌన్: పార్టీ పుట్టి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా గ్రామాల్లో సీపీఐ పార్టీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని దీని కోసం పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి సమితిసింగారం గ్రామంలో వజ్రా వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు జంగం మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్, సర్వర్, గద్దం వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సీతారాములు, తోట రమేశ్, తూపుడు శ్రీను, కణితి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- అశ్వాపురం మండల పర్యటనలో ఎమ్మెల్యే పాయం
- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



బస్టాండ్‌కు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

అశ్వాపురం: పినపాక నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలో ఎమ్మెల్యే పాయం సోమవారం పర్యటించారు. రూ.80 లక్షలతో మల్లెలమడుగు, రామచంద్రాపురం గ్రామ పంచాయతీలలో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. రామచంద్రాపురం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం భవనానికి, రామచంద్రాపురం క్రాస్ రోడ్డులో ఐటీసీ ఆధ్వర్యంలో నిర్మించనున్న బస్టాండ్‌కు భూమి పూజ చేశారు. రామచంద్రాపురం-ఇరవెండి రహదారిపై నూతనంగా నిర్మించిన వంతెన వద్ద చెక్ డ్యాం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఇరిగేషన్, అటవీ శాఖల అధికారులతో చెక్‌డ్యాం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మల్లెలమడుగు, రామచంద్రాపురం, సత్యనారాయణపురం కాలనీ గ్రామాల్లో ప్రజలనుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అశ్వాపురంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి నూతన గృహాన్ని సందర్శించి కేశవరెడ్డి కుటుంబసభ్యులతో మాట్లాడారు. తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ వరప్రసాద్, ఏపీఎం సత్యనారాయణ, సీఐ అశోక్‌రెడ్డి, ఏఓ సాయిశంతన్‌కుమార్, పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ చక్రధరాచారి, కార్యదర్శులు జ్యోతి, తౌఫిక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, ఓరుగంటి రమేష్, గాదె కేశవరెడ్డి, బూరెడ్డి వెంకటరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రామకృష్ణ, వీరరాఘవులు, నాయకులు పాల్గొన్నారు.

# హాస్టళ్లను సందర్శించిన అధికారులు



వసతిగృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న మండల తహసీల్దార్, ఎంపీడీఓ

మణుగూరుటౌన్: మండలంలోని ఎస్సీ బాలుర, ఎస్సీ బాలికల వసతి గృహాలను మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌లు సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెనూ పాటించడంతో పాటు విద్యార్థులకు అందుతున్న భోజన వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వసతి గృహంలో భోజనం వండుతున్న పరిసరాలను కూరగాయలు ఉంచుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదని వార్డెన్లను హెచ్చరించారు. పరిశుభ్ర వాతావరణంలో పిల్లలకు భోజనం వడ్డించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు కలుగుతున్న అసౌకర్యాలను, మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర్లు కూడా ఉన్నారు.

# జీవన భృతి అమలు చేయాలి



దమ్మపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ రంగ కార్మికులు, నాయకులు

దమ్మపేట: ఎన్నికల సమయంలో వ్యవసాయ కార్మికులకు జీవన భృతిగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన రూ.12,000లను వెంటనే అమలు చేయాలని, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం దమ్మపేట మార్కెట్ యార్డులో వ్యవసాయ కార్మిక సంఘం మండల సమావేశం నిర్వహించారు. అనంతరం వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. మార్కెట్ యార్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ కాసేపు నిరసన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ కార్మికుల సమస్యలపై డిసెంబరు 2న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాకు అధిక సంఖ్యలో కార్మికులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు గోకినపల్లి ప్రభాకర్, తోడెం దుర్గమ్మ, కుర్సం ముత్యాలరావు, పండూరి వీరబాబు, కాకా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వే నిష్పక్షపాతంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రమ

భద్రాచలంటౌన్: కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 4 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న రాష్ట్రీయ సర్వేక్షన్ 2024 ఎన్‌ఏఎస్‌లో ఎటువంటి రాగద్వేషాలకు తావు లేకుండా నిష్పక్షపాతంగా విద్యార్థుల సామర్థ్యాలను వెలికి తీసేలా సర్వే నిర్వహించాలని మండల ఎంఈఓ తోటమళ్ళ రమ పేర్కొన్నారు. పట్టణంలోని ఉపాధ్యాయ కళాశాలలో సోమవారం రాష్ట్రీయ సర్వేక్షన్ 2024లో భాగంగా ఎంపిక చేసిన ఛాత్రోపాధ్యాయులకు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తగు సూచనలు, జాగ్రత్తలు అందించారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీ ఏ.నాగరాజ శేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ భవాని, మాస్టర్ ట్రైనర్ శ్రీ ప్రభు సింగ్ పాల్గొన్నారు.

# నాయకులకు వినతుల వెల్లువ



మంత్రి తుమ్మలతో మాట్లాడుతున్న గౌడ సంఘం నాయకులు

**మంత్రి తుమ్మలకు..**

దమ్మపేట: ఏజెన్సీ ప్రాంతంలో యేళ్ల తరబడి నివసిస్తున్న గౌడ కులస్తులను ఎస్టీల జాబితాలోకి చేర్చాలని కోరుతూ.. అశ్వారావుపేట నియోజకవర్గ గౌడ సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రము అందజేశారు. సోమవారం మండలంలోని గండుగులపల్లి నివాసంలో మంత్రి తుమ్మలను, నియోజకవర్గ గౌడ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. గౌడ సంఘం నాయకులు కాసాని నాగప్రసాద్, కొమురయ్య, దుర్గారావు, శ్రీను, భరద్వాజ్, రాంబాబు పాల్గొన్నారు.

**అటవీశాఖ అభివృద్ధి చైర్మన్ పొదెంకు..**

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలంలో మిషన్ భగీరథ పనితీరు, నిర్వహణపై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరమాచినేని వినీల్ రాష్ట్ర అటవీశాఖ అభివృద్ధి చైర్మన్ పొదెం వీరయ్యకు సోమవారం ఫిర్యాదు చేశారు. మిషన్ భగీరథ ద్వారా మండల వ్యాప్తంగా తాగునీరు అందించాల్సి ఉండగా మితిమీరిన అవినీతి, నిర్లక్ష్యం కారణంగా సగం గ్రామాలకు మాత్రమే నీరు అందుతుందన్నారు. తక్షణమే మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణం, నిర్వహణపై విచారణ చేపట్టి మండలంలోని అన్ని గ్రామాలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఎమ్మెల్యే పాయంకు..**

మణుగూరుటౌన్: ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ మణుగూరు కాలేజీ పోస్టుల మంజూరు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది ఘనంగా సన్మానించారు. సోమవారం ప్రజాభవన్ కార్యాలయంలో ఈ సందర్భంగా ఫర్నిచర్ లేమితో పాటు ఇతర సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగముని నాయక్, జనరల్ సెక్షన్ హెచ్‌ఓడీ వినోద్, టీఎస్ పాల్ రాష్ట్ర అధ్యక్షుడు మైనింగ్ సెక్షన్ ఉదయ్ భాస్కర్, అధ్యాపకుడు లక్ష్మణ్, రాంబాబు, శాంతి సుధా, వినీల్ కల్యాణ్, రాంగణేశ్, జాన్సన్, రాంబాబు తదితరులు ఉన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు కలిసి గ్రామంలో ప్రధాన సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించడం, చింతకుంట వలస ఆదివాసీ గ్రామంలో మినీ అంగన్‌వాడీ కేంద్రానికి భవనం నిర్మించడం, విద్యుత్ సౌకర్యం కల్పించడం, డీపీఈపీ పాఠశాల ఆవరణ చుట్టూ ప్రహరీ నిర్మించడం, నెల్లిపాక రెవెన్యూలో 190సర్వే నంబర్ భూములకు బ్యాంక్ లోన్లు ఇవ్వడం లేదని పట్టాపాస్ పుస్తకాలు ఇప్పించడం తదితర సమస్యలపై ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు స్వర్గం బాలనర్సయ్య, దండి రాములు, బొమ్మరాతి రామయ్య, బొడ్డు రాములు తదితరులు పాల్గొన్నారు.

### సేంద్రియ ఎరువులనే వాడాలి

ములకలపల్లి: పంటల్లో అధిక దిగుబడిని సాధించేందుకు సేంద్రియ ఎరువులనే వినియోగించాలని మండల వ్యవసాయాధికారి (ఎంఏఓ) అరుణ్‌బాబు సూచించారు. ములకలపల్లి జీఎస్ కాన్వెంట్ సిస్టర్స్ మహిళా రైతుల సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఇంట్లోని కూరగాలయ వ్యర్థాలను కంపోస్టుగా మార్చి సేంద్రియ ఎరువులు తయారు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సిస్టర్ నిర్మల, సంఘ చైర్మన్ ఈశ్వరి, కార్యదర్శి సుశీల, మహిళా రైతులు పాల్గొన్నారు.

### స్కూల్ బ్యాగుల పంపిణీ

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడులోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కొత్తగూడెం శ్రీనగర్ కాలనీకి చెందిన అక్రమ్ హుస్సేన్ ఆర్థిక సహకారంతో స్కూల్ బ్యాగ్స్, టీ షర్టులను పంపిణీ చేశారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో 150మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎమ్ తేజావత్ మోహన్‌లాల్, రమేష్, రూప్లా, సీతారామ్, హరిలాల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### భగవద్గీత కంఠస్థ పోటీలు

ములకలపల్లి: గీతా జయంతిని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ములకలపల్లి ప్రఖండ ఆధ్వర్యంలో సోమవారం భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. స్థానిక శిశుమందిర్ ఆవాస విద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు డాక్టర్ పుల్లారు ప్రణయ్ బహుమతులను అందజేశారు. వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు డాక్టర్ కారంపూడి సత్యనారాయణ రాజు, కార్యదర్శి కీసరి వీరభద్రం, విభాగ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి గంగాధర సీత, జిల్లా సామరస్యతా ప్రముఖ్ గొడ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

### యోగా ఇన్‌స్ట్రక్టర్ల నియామకం



యోగా చేస్తున్న భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని ప్రభుత్వ హోమియోవైద్యశాలకు యోగా ఇన్‌స్ట్రక్టర్‌లుగా రమాదేవి, లక్ష్మీకుమారి,సునిత, మనోజ్‌కుమార్ లు నియామకం అయ్యారు. కాగా సోమవారం ఈ యోగా కేంద్రాన్ని జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ వెంకటేశ్వరరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఏరియా ఆసుపత్రిలో ఉన్న వైద్య సిబ్బంది యోగా శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగాం కోఆర్డినేటర్ డాక్టర్ మహేష్‌గౌడ్, ఫార్మాసిస్ట్ వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

### ఆశయ సాధనకు కృషి చేయాలి

ములకలపల్లి: తుదిశ్వాస వరకూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జీవించిన అయితా బాబూరావు ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఎండి.యూసఫ్ పిలుపునిచ్చారు. బాబూరావు ఐదో వర్ధంతిని పురస్కరించుకొని మండలకేంద్రంలోని స్మారకస్తూపం వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. చిత్రపటానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. పార్టీకి బాబూరావు అందించిన సేవలను వివరించారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి నరాటి రమేష్, నరాటి సత్యం, అనుమల సాయి, ఏఐటీయూసీ నాయకులు నకిరకంటి పుల్లారావు, సాగర్, రావుల రమేష్, ముఖేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థికంగా లబ్ధిపొందాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం: రైతులు తాము పండించిన పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ఆర్థికంగా లబ్ధిపొందాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిన్ననల్లబెల్లి, మహదేవపురం గ్రామాల్లో గిరిజన సహకార సంస్థ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులెవరూ దళారులను నమ్మకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు అమ్ముకోవాలని అన్నారు. అధికారులు కొనుగోలు సెంటర్‌లలో ఎటువంటి అవకతవకలు లేకుండా కొనుగోలు చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్ కుమార్, ఆర్‌ఐలు నరసింహారావు, వెంకటేశ్వరరావు, ఎస్సై గణేష్, జీసీసీ అధికారులు, మాజీ జెడ్పీటీసీ సీతమ్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లంకాశ్రీనివాసరావు, పిలక వెంకటరమణ రెడ్డి, తోట రమేష్, గద్దం బాలాజీ, కోడి చంటి, మాజీ ఎంపీటీసీ తిరుపతిరావు, సిలకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు ప్రారంభం



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జారే, అధికారులు, నాయకులు

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గ వ్యాప్తంగా పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కాగా త్వరలోనే ఆ పనులను ప్రారంభించనున్నట్టుగా స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వెల్లడించారు. సోమవారం మండల పరిధిలోని గండుగులపల్లి, మొండివర్రె, నాచారం, నాగుపల్లి, శ్రీరాంపురం, తొట్టిపంపు, మొద్దులగూడెం, ముష్టిబండ, మందలపల్లి, మారప్పగూడెం, దమ్మపేట, మల్కారం, పెద్దగొల్లగూడెం, పార్కలగండి, పట్వారిగూడెం, జగ్గారం, లింగాలపల్లి తదితర గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేసిన ఎమ్మెల్యే జారే.. కల్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు స్థానిక నాయకులతో కలసి అందజేశారు. ఆయా గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే, 28 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను, 35 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలనపై కళాజాతా



బూర్గంపాడులో ప్రజాపాలనపై ప్రదర్శన చేస్తున్న కళాకారులు

బూర్గంపాడు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా బూర్గంపాడు, మోరంపల్లిబంజర, సారపాక గ్రామపంచాయతీలలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు కళాజాత ప్రదర్శనలు నిర్వహించారు. ఎంపీడీఓ జమలారెడ్డి ఆదేశానుసారం సోమవారం బూర్గంపాడు, మోరంపల్లిబంజర, సారపాక గ్రామపంచాయతీల్లోని ప్రధాన కూడళ్లలో ప్రజాపాలన విజయోత్సవాలను వివరిస్తూ.. కళాకారులు పాటలు పాడుతూ.. కళాప్రదర్శనలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు మహేష్, ప్రభాకర్, భవాని, కళాకారులు కాంపల్లి బాలు, గోవింద్, గురవయ్య, షేక్ మూసా, డప్పు నరేంద్ర, స్నేహ, కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సైగా బాధ్యతలు స్వీకరణ



అశ్వారావుపేట (చంద్రుగొండ): చంద్రుగొండ నూతన ఎస్సైగా పి.శివరామకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న గంజి స్వప్న డ్యూటీమిట్‌లో భాగంగా ఝార్ఖండ్ వెళ్తున్న నేపథ్యంలో ఆమె స్థానంలో అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌లో అదనపు ఎస్సైగా పని చేస్తున్న శివరామకృష్ణను బదిలీపై ఉన్నతాధికారులు కేటాయించారు. దీంతో ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

### వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా రాణి



దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని దమ్మపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండలంలోని పట్వారిగూడెం గ్రామానికి చెందిన వాసం రాణి నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలోని సీనియర్(పాత) కాంగ్రెస్ నాయకులు వాసం శ్రీను భార్య రాణికి ఈ పదవి దక్కింది. నియోజకవర పరిధిలోని ములకలపల్లి మండలానికి చెందిన కణితి సత్యనారాయణ వైస్ చైర్మన్‌గా నియమించబడ్డారు. పాలకవర్గ సభ్యులుగా మూయబోయిన లక్ష్మీ, సోయం రాములు, చిప్పల బాబురెడ్డి, వగ్గెల ధనలక్ష్మి, బుద్దా రాజు, జర్పుల తులసీరాం, గుండె సుజాత, కునుసోతు లింగయ్య, పట్టెల నాగరాజు, బింగి శేషగిరి, పసుమర్తి ముక్తేశ్వరరావు, శీమకుర్తి శివప్రసాద్‌లు మొత్తంగా 12 మంది నియమితులయ్యారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణలు అభినందనలు తెలియజేశారు.

### సీపీఎం మండల కార్యదర్శిగా ప్రసాద్



అశ్వారావుపేటరూరల్: సీపీఐ(ఎం) అశ్వారావుపేట మండల నూతన కార్యదర్శిగా సోడెం ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మండలంలోని గుంటిమడుగు గ్రామంలో జరిగిన పార్టీ మండల మహాసభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పర్యవేక్షణలో నూతన కార్యదర్శితోపాటు మరో ఇరవై మందితో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శివర్గ సభ్యులుగా బి.చిరంజీవి, మడకం గోవిందు, ముళ్లగిరి గంగరాజు, కారం సూరిబాబు, మడిపల్లి వెంకటేశ్వరరావు, తగరం నిర్మలతోపాటు మండల కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు బాధ్యులు తెలిపారు.

# శివాలయంలో కార్తీక పూజలు

అశ్వారావుపేట(అన్నపురెడ్డిపల్లి): అన్నపురెడ్డిపల్లిలోని భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి ఆలయంలో కార్తీకమాసం చివరి సోమవారం పురస్కరించుకుని భక్తులు పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా భక్తులు వేకువజామునే ఆలయానికి చేరుకుని కోనేరులో పవిత్ర స్నానాలు ఆచరించారు. దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి సన్నిధిలో అర్చనలు, అభిషేకాలు జరిపించారు.

అశ్వారావుపేటరూరల్: కార్తీక మాసం సందర్భంగా సోమవారం భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వినాయకపురం, పాత మామిళ్లవారిగూడెం, నారాయణపురం, అశ్వారావుపేటలోని శివాలయం, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో మహిళలు పూజలు చేసి, దీపాలు వెలిగించారు. అలాగే అభిషేకాలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. దీంతో ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.



అశ్వారావుపేటరూరల్: శివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు



అశ్వారావుపేట(అన్నపురెడ్డిపల్లి): దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు